సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం ౹ 6 ౹ ఫిబ్రవరి ౹ 2025



భూ దాతలకు అండగా..

డుంబ్రిగుడ మండలంలో ఏకలవ్య పాఠశాలకు భూములిచ్చిన దాతలకు ఎస్టీ కమిషన్ అండగా ఉంటుందని ఛైర్మన్ శంకరరావు తెలిపారు. 8లో



పీడీఎస్ బియ్యం పట్టివేత

రాజవొమ్మంగి, దూసరపాములలో సుమారు 840 కిలోల పీడీఎస్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 8లో



ప్రతి చిన్నారికి డీవార్మింగ్ మాత్రలు

జిల్లాలో ప్రతి చిన్నారికి డీవార్మింగ్‌మాత్రలు వేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు. 8లో

న్యూస్‌రీల్

పెదబయలు పాఠశాలకు హరిత విద్యాలయ అవార్డు



అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం, గ్రీన్ టీచర్

పెదబయలు: స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర–1 పాఠశాలకు జాతీయ స్థాయిలో హరిత విద్యాలయం అవార్డు లభించింది. ఈ నెల 4న న్యూఢిల్లీలో ఈ అవార్డును ప్రముఖ పర్యావరణవేత్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత సునీత నారాయణ, రామన్ మెగసెసే అవార్డు గ్రహీత సోనం వాంగ్‌చుక్ చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.నాగేశ్వరరావు, ఎన్‌సీసీ క్లస్టర్ కోఆర్డినేటర్, గ్రీన్ టీచర్ చెండా బాలకృష్ణ అందుకున్నారు. పాఠశాలలో నీటి సంరక్షణ, జీవవైవిధ్యం, పరిశుభ్రత, ఎనర్జీ కన్జర్వేషన్ తదితర పలు పర్యావరణహిత కార్యక్రమాల నిర్వహణ, వివిధ రకాల ఔషధ మొక్కల పెంపకం, ఎకో గ్రూపులను ఏర్పాటు చేసి విద్యార్థులను భాగస్వాములను చేసినందుకు హరిత విద్యాలయం అవార్డు లభించినట్టు హెచ్‌ఎం తెలిపారు. నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో ఈ అవార్డుకు తమ పాఠశాలను ఎంపిక చేసినట్టు చెప్పారు.జాతీయ స్థాయిలో అవార్డు రావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

క్రీడాకారుడు రోహిత్‌కు ఆర్థిక సాయం



రోహిత్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: విజయవాడలో ఈనెల 9న జరగనున్న జాతీయ క్రీడల్లో పాల్గొనున్న అథ్లెటిక్ క్రీడాకారుడు శెట్టి రోహిత్‌కు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ బుధవారం తన కార్యాలయంలో రోహిత్‌కు రూ.20వేలు అందజేశారు. డుంబ్రిగుడ మండలం గేదెలబంద గ్రామానికి చెందిన శెట్టి రోహిత్ అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. రాష్ట్ర,జాతీయ స్థాయి పరుగు పోటీల్లో పాల్గొని ఇప్పటికి 35 బంగారుపతకాలు సాధించాడు.ఈమేరకు రోహిత్‌ను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందిస్తామన్నారు. తన కుమారుడికి ఆర్థిక సాయం అందజేసిన కలెక్టర్‌కు రోహిత్ తండ్రి శెట్టి సంజీవ్ కృతజ్ఞతలు తెలిపారు.

హుషారుగా రబీ



చింతలవీధిలో వరినారు సేకరిస్తున్న గిరిజన మహిళలు



గుర్రగరువు ప్రాంతంలో వరినాట్లు వేస్తున్న రైతులు

- వ్యవసాయ పనుల్లో గిరిజన రైతులు బిజీ
- 2,361 హెక్టార్లలో ఏటా రెండో పంటగా వరి సాగు

సాక్షి,పాడేరు: జిల్లాలో వరిసాగు జోరందుకుంది. ఎక్కడ చూసినా రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. రబీలో రెండవ పంటగా జిల్లాలో 2,361 హెక్టార్లలో వరిసాగు చేయనున్నారు. వరినారుమడులు ఆశాజనకంగా ఎదగడంతో నారు సేకరణ, నాట్లు వేసే పనుల్లో అన్నదాతలు బిజీగా ఉన్నారు. నీటి నిల్వలు అందుబాటులో ఉన్న భూముల్లో గిరిజన రైతులు రబీలో వరిపంటను సాగు చేస్తారు. జిల్లా వ్యాప్తంగా గత రబీ సీజన్‌లో 2,361 హెక్టార్లలో వరి సాగు చేశారు.ఈ ఏడాది కూడా అంతే విస్తీర్ణంలో వరిపంట వేసేందుకు రైతులు శ్రీకారం చుట్టారు. నారుముడులు ఆశాజనకంగా ఎదిగాయి. గిరిజన రైతులు తమ వద్ద ఉన్న సంప్రదాయ ఎంటీయూ 1021 విత్తనాలనే రబీ సాగుకు వినియోగించారు. తక్కువ సమయంలో అంటే 125 నుంచి 130రోజుల వ్యవధిలో పంట దిగుబడికి వస్తుందని వ్యవసాయ అధికారులు తెలిపారు.ఈ ఏడాది కూడా వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో పాటు నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. ఇప్పటికే 70శాతం భూముల్లో వరినాట్లు పూర్తిచేశారు. మిగిలిన భూముల్లో కూడా మరో 10రోజుల వ్యవధిలో వరినాట్లు పూర్తి అవుతాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నందు తెలిపారు.

స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలకు నిరసనగా
11,12 తేదీల్లో బంద్



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు

- అయ్యన్న పాత్రుడు బేషరతుగా క్షమాపణ చెప్పాలి
- అఖిలపక్ష నాయకుల డిమాండ్

పాడేరు : గిరిజనులకు రక్షణ కవచంగా ఉన్న 1/70 చట్టాన్ని సడలించాలన్న అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, ఆదివాసీలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేదంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు తెలిపారు. ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు సారధ్యంలో సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అప్పలనర్స అధ్యక్షతన పట్టణంలోని వీఆర్ కల్యాణ మండపంలో బుధవారం అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి వైఎస్సార్‌సీపీతో పాటు సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, బీఎస్పీ, గిరిజన సంఘం, గిరిజన ఉద్యోగుల సంఘం, పలు మహిళ, ఆదివాసీ సంఘాల నాయకులు, ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, అఖిల పక్ష నాయకులు మాట్లాడుతూ అయ్యన్న వ్యాఖ్యలకు నిరసనగా వైఎస్సార్‌సీపీ సారధ్యంలో ఈనెల 11, 12 తేదీల్లో 48 గంటల పాటు నిరవధికంగా బంద్ నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలిపి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే స్పీకర్ అయ్యన్నపాత్రుడితో ఈ వ్యాఖ్యలు చేయించిందని ఆరోపించారు. గిరిజన ప్రాంతంలో ఉన్న ఖనిజ సంపదను దోచుకునేందుకు ఈ పన్నాగం పన్నారని తెలిపారు. గిరిజన ప్రాంతం జోలికి ఎవరు వచ్చినా చూస్తూ ఊరుకునేది లేదని వారు హెచ్చరించారు.



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

ఈ కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, దండకారణ్య ఉద్యోగ సమితి కేంద్ర ప్రతినిధి సమరెడ్డి మాణిక్యం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కూడా రాధాకృష్ణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శతక బుల్లిబాబు, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సుర్ల అప్పారావు, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖీ శేషాద్రి, పెదబయలు జెడ్పీటీసీ కూడా బొంజుబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళ అధ్యక్షురాలు కురుసా పార్వతమ్మ, ఆదివాసీ సేన అధ్యక్షుడు చుంచు రాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ సంయుక్త కార్యదర్శి కూడా సురేష్‌కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు శరభ సూర్యనారాయణ, నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు కె.ఊర్వశిరాణి, మాజీ ఎంపీపీ సల్లంగి ఉమామహేష్, అధిక సంఖ్యలో ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మార్చి 17 నుంచి ఓపెన్ టెన్త్ పరీక్షలు

- జిల్లాలో 18 కేంద్రాల ఏర్పాటు

సాక్షి,పాడేరు: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ టెన్త్ పరీక్షల షెడ్యూల్ బుధవారం విడుదలైనట్టు డీఈవో పి.బ్రహ్మాజీరావు, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.శశికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 17న హిందీ, 19న ఇంగ్లిష్, 21న తెలుగు/ఉర్దూ/కన్నడ/తమిళం,24న గణితం/భారతీయ సంస్కృతి మరియు వారసత్వం, 26న శాస్త్ర మరియు సాంకేతిక విజ్ఞానం/గృహ విజ్ఞాన శాస్త్రం,28న సాంఘిక శాస్త్రం/ఆర్థిక శాస్త్రం పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో 18 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. అరకులోయలో 3,పాడేరులో 3,చింతూరులో 3,చింతపల్లిలో 4,రంపచోడవరంలో 5 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు

- కోడ్ పక్కాగా అమలు చేయాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్



జూమ్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, తూర్పుగోదావరి,పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో బుధవారం జూమ్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం జరుగుతోందన్నారు.ఈనెల 11న నామినేషన్ల పరిశీలన,13న ఉపసంహరణ ప్రక్రియ ఉంటుందని చెప్పారు. ఈనెల 27వ తేదీ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, అనంతరం బ్యాలెట్ బాక్సులను విశాఖపట్నం,ఏలూరులకు తరలించి భద్రపరుస్తామని తెలిపారు.మార్చి 3న ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఆయన తెలిపారు.ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కాగా అమలుజేయాలని జిల్లా పంచాయతీ అధికారికి సూచించారు. పోస్టర్లు,బ్యానర్లు,ఫ్లెక్సీలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు 14మంది నోడల్ అధికారులను నియమించినట్టు చెప్పారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.ఎన్నికల అధికారులు,సిబ్బంది రవాణాకు అవసరమైన రూట్‌మ్యాప్‌తో పాటు వాహనాలను సమకూర్చాలని సర్వే ఏడీతో పాటు రవాణాశాఖ అధికారులను ఆదేశించారు. పాడేరు డివిజన్‌లో ఐదు జోన్లు,రంపచోడవరం డివిజన్‌లో ఏడు జోన్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.ఎన్నికల అధికారులు, సిబ్బందికి ఎన్నికల ప్రక్రియపై తగిన శిక్షణ ఇవ్వాలని జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్,ర్యాంపులు తదితర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్పీ అమిత్‌బర్దర్,ఏఎస్పీ ధీరజ్,రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ, డీఆర్‌వో కె.పద్మలత,ఎస్‌డీసీలు అంబేడ్కర్,లోకేష్,డీఈవో బ్రహ్మాజీరావు,జిల్లా వ్యవసాయాధికారి నందు,సీపీవో ఎస్.ఎస్.ఆర్.కె.పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కంట్రోల్ రూమ్ ఏర్పాటు

రంపచోడవరం: తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు రంపచోడవరం సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ తెలిపారు. ఈ ఎన్నికలకు సంబంధించిన సమస్యలు, సందేహాలు ఉంటే 08864–243561 అనే నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని చెప్పారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

చింతపల్లి: జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతున్నాయి. అయితే మంచు ప్రభావం తగ్గడం లేదు. బుధవారం జీకే వీధిలో 12.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు.పాడేరుల డివిజన్ పరిధిలో జి.మాడుగులలో 12.9 డిగ్రీలు, అరకులోయలో 12.9 డిగ్రీలు,చింతపల్లిలో 13.5 డిగ్రీలు,డుంబ్రిగుడలో 13.7 డిగ్రీలు,పాడేరులో 14.0 డిగ్రీలు,పెదబయలులో 14.5 డిగ్రీలు,హుకుంపేటలో 14.7 డిగ్రీలు,ముంచంగిపుట్టులో 15.8 డిగ్రీలు,అనంతగిరిలో 19.4 డిగ్రీలు, కొయ్యూరులో 19.7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్టు ఏడీఆర్ తెలిపారు.

మహాశివరాత్రి జాతర ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్

హుకుంపేట: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన ప్రముఖ పుణ్యక్షేత్రం మత్స్యగుండం వద్ద మహాశివరాత్రి జాతర కోసం చేస్తున్న ఏర్పాట్లను బుధవారం సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్ పరిశీలించారు. అంతకుముందు ఆలయంలో మత్స్యలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ,ఆలయ కమిటీల సభ్యులు ఆయనను దుశ్శాలువాతో సన్మానించారు. అనంతరం మహాశివరాత్రి జాతర కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు, పార్కింగ్ స్థలాలు, రెవెన్యూ, వైద్య, పోలీస్,అగ్నిమాపక, ఆర్టీసీ సిబ్బంది విధుల్లో ఉండే ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఐ నాయుడు, ఆర్‌ఐ సీతమ్మ,ఆలయ కమిటీ సభ్యుడు అప్పారావు, ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గోపాలపాత్రుడు, పాంగి మత్స్య కొండబాబు, సభ్యులు ఆనంద్, బాలయ్య,హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

కొయ్యూరు: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పాడేరు డీఎల్‌పీవో పి.ఎస్.కుమార్ హెచ్చరించారు. ఎంపీడీవో ప్రసాద్‌తో కలిసి కొయ్యూరు,రాజేంద్రపాలెం పంచాయతీల్లో బుధవారం ఆయన పర్యటించారు. కొయ్యూరు సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా ఈనెల 3వ తేదీ నుంచి కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. కోడ్‌ను ఎవరూ అతిక్రమించరాదని తెలిపారు. అనంతరం రాజేంద్రపాలెంలో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాన్ని పరిశీలించి, వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. పన్నుల వసూళ్లపై కార్యదర్శులతో ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు.పన్నుల వసూలు వేగవంతం చేయాలని సూచించారు.ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో రాజవొమ్మంగి, దూసరపాము గ్రామాల్లో అక్రమంగా ఉన్న సుమారు 840 కిలోల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. రాజవొమ్మంగిలో ఓ ఆటోలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 540 కిలోల పీడీఎస్ బియ్యాన్ని స్థానిక రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రక్షణ్ కుమార్ అనే వ్యక్తి ఆటోలో బియ్యాన్ని రాజవొమ్మంగి నుంచి బడదనాంపల్లి తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో వాహనాన్ని అదుపులో తీసుకున్నట్టు తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. ఈ సంఘటనలో ఆటోను సీజ్ చేసి స్థానిక పోలీసుస్టేషన్‌కు తరలించినట్టు తెలిపారు. ఈ దాడిలో డీటీ కరీముల్లా, ఆర్ఐ చెల్లమ్మ, వీఆర్వో సూర్యకాంతం ఉన్నారు. ఇదిలా ఉండగా దూసరపాము గ్రామంలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన పోతురాజుకు చెందిన 8 బస్తాల పీడీఎస్ బియ్యం (సుమారు 300 కిలోలు) స్వాధీనం చేసుకున్నట్టు ఆర్ఐ చెల్లమ్మ తెలిపారు. తూకం వేసి పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

కాఫీ కొనుగోలు ధరల సవరణ

మహారాణిపేట(విశాఖ): గిరిజనుల వద్ద నుంచి సేకరిస్తున్న కాఫీ కొనుగోలు ధరలను గిరిజన సహకార సంస్థ (జీసీసీ) సవరించింది. పెరిగిన అంతర్జాతీయ కాఫీ ధరలు, గిరిజన కాఫీ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కాఫీ అరబికా పార్చ్‌మెంట్ రకం, అరబికా చెర్రీ రకం ధరలను జీసీసీ పెంచింది. 2024–25 కాఫీ సీజన్‌కు సవరించిన ధరలకు అనుగుణంగా మిగిలిన మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాలకు బదిలీ చేస్తామని జీసీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాఫీ కొనుగోలుకు సంబంధించిన ఫిర్యాదుల కోసం జీసీసీ కార్యాలయంలో 70130 70990 నంబర్ అందుబాటులో ఉంటుందన్నారు. అరబికా పార్చ్‌మెంట్ రకానికి ప్రస్తుతం ఉన్న రూ.350 నుంచి రూ.400కు, అరబికా చెర్రీ రకానికి ప్రస్తుతం ఉన్న ధర రూ.230 నుంచి రూ.250కు పెంచామన్నారు. చింతపల్లి, జి.కె.వీధి ఇతర ప్రాంతాల్లో ఉన్న ఆర్గానిక్ సర్టిఫికేషన్ కలిగిన గ్రామాల నుంచి కొనుగోలు చేసిన కాఫీ ధరలను అధికంగా పెంచినట్టు ఆమె చెప్పారు. ఈ ధరల గురించి పాడేరు ఏజెన్సీలోని గిరిజన కాఫీ రైతులందరికీ తెలియజేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రకటించిన కాఫీ ధరల కంటే తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దని కాఫీ రైతులకు సూచించారు. పలు మండలాల్లో 2,600 మంది కాఫీ రైతులకు చెందిన 2258.55 హెక్టార్లలో కాఫీ, మిరియాల పంటలకు ఆర్గానిక్ సర్టిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేశామన్నారు.

ఇవేం పనులు.?

- ఏయూ జర్నలిజం విభాగం అధికారులకు వీసీ, రిజిస్ట్రార్ మందలింపు
- ఎన్నికల కోడ్ ఉండగా కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం
- శిలాఫలకం వల్ల తలెత్తిన ప్రోటోకాల్ వివాదం



ఏర్పాటు చేసిన శిలాఫలకం.. తొలగించిన తర్వాత ఇలా..

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ జర్నలిజం విభాగంలో బుధవారం జరిగిన కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవం వివాదానికి దారి తీసింది. వర్సిటీలోని కొంతమంది అధికారుల అత్యుత్సాహంతో ప్రోటోకాల్ రగడ రాజుకుంది. యూనివర్సిటీకి అధిపతిగా ఉన్న ఉపకులపతి జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ధనుంజయరావు పేరు లేకుండానే జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం వద్ద శిలాఫలం ఏర్పాటు చేశారు. మరోవైపు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ అట్టహాసంగా కాలేజీ ప్రిన్సిపాల్ నరసింహారావుతో ప్రారంభోత్సవం చేయించిన విభాగం అధికారుల వ్యవహారం ప్రస్తుతం వర్సిటీలో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ విషయం వీసీ, రిజిస్ట్రార్ దృష్టికి రావడంతో.. వారు సంబంధిత విభాగం అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు ఇవేం పనులని మందలించి.. వెంటనే శిలాఫలకం తొలగించాలని ఆదేశించారు. దీంతో అప్పటికప్పుడు ఆ శిలాఫలకాన్ని తొలగించారు.

దాతకు తప్పని పరాభవం

ఏయూ శతాబ్ది ఉత్సవాలు ముంచుకొస్తున్నాయి. వందేళ్ల పండగకు పూర్వ విద్యార్థులు, దాతలను పెద్ద ఎత్తున ఆహ్వానించి, వర్సిటీ అభివృద్ధిలో భాగస్వాములను చేసేలా పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలి. కానీ వర్సిటీలో ఇందుకు విరుద్ధమైన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. వర్సిటీ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం విద్యార్థుల సౌకర్యార్థం కంప్యూటర్ ల్యాబ్ ఆధునికీకరణకు ఎంతో ఉదార స్వభావంతో ఓ దాత నిధులు ఇచ్చారు. అలాంటి దాతలను మరింత మందిని ప్రోత్సహించేలా వర్సిటీ అధికారులు తగు రీతిన గౌరవించాల్సి ఉంది. కానీ ప్రారంభోత్సవ వేళ ప్రోటోకాల్ వివాదం తలెత్తడం, తన కళ్ల ముందే శిలాఫలకం తొలగించడం తదితర పరిణామాలతో నిధులు ఇచ్చిన దాత అవాక్కయ్యారు.

నిబంధనలు పట్టవా?

ఏయూతో ఉన్న అనుబంధంతో పూర్వ విద్యార్థులు, పారిశ్రామిక వేత్తలు, పలువురు దాతలు తోచిన రీతిన వర్సిటీకి సాయం అందిస్తుంటారు. వారి సాయంతో చేపట్టే పనులు, వారి పేరుతో వర్సిటీలో శాశ్వతంగా ఉండే శిలాఫలకాలను ఏర్పాటు చేసేటప్పుడు వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్, అదే విధంగా పాలక మండలి ఆమోదం ఉండాలి. కానీ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగంలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటుకు సంబంధించి వీసీ, రిజిస్ట్రార్‌లకు కనీస సమాచారం లేకుండానే శిలాఫలకం ఏర్పాటు చేయడం గమనార్హం.

వర్సిటీ విభాగాల్లో ఇష్టారాజ్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏయూలో రాజకీయాలు జోరందుకున్నాయి. వర్సిటీలోని కొన్ని విభాగాల అధికారులు, సిబ్బంది విద్యార్థులకు పాఠాలు చెప్పడం మానేసి, తమ ప్రాబల్యాన్ని పెంచుకునేందుకు పావులు కదుపుతున్నారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా స్థానికుడనే నియమించాలని ఇటీవల కాలంలో ఆచార్యులే నిరసనలు చేపట్టడం గమనార్హం. వైస్ చాన్సలర్‌గా ఐఐటీకి చెందని వారిని నియమిస్తారని దాదాపు తేలడంతో.. ప్రస్తుత వర్సిటీ అధికారులు పాలనపై పూర్తి స్థాయిలో దృష్టి సారించడం లేదు. ఫలితంగా విభాగాల్లో ఆచార్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో విద్యార్థుల చదువులు తిరోగమనం వైపు వెళ్తున్నాయి.


ప్రారంభోత్సవం జరిగిన జర్నలిజం విభాగం ఇదే..


కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన ప్రిన్సిపాల్ నరసింహారావు

శిలాఫలకం తొలగించమని ఆదేశించాం

కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు మంచిదే. కానీ శిలాఫలకం ఏర్పాటు చేస్తామని జర్నలిజం విభాగం నుంచి మాకెలాంటి సమాచారం లేదు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రారంభోత్సవం కూడా చేయకూడదు. అందుకే శిలాఫలకాన్ని తొలగించమని ఆదేశించాం. ఇలాంటి ఘటనలు జరగకుండా విభాగాధికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తాం.

– ఆచార్య ధనుంజయరావు, రిజిస్ట్రార్

నాణ్యమైన కాఫీ గింజలకు అధిక ధర

కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: నాణ్యమైన కాఫీ గింజలు సరఫరా చేసిన గిరిజన రైతులకు అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం అధిక ధర చెల్లించాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఏఈవోలు,ఉద్యానవనశాఖ కన్సల్టెంట్‌లు, ఫీల్డు కన్సల్టెంట్‌లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతపల్లి, జీకే వీధి మండలాల్లో ఆర్గానిక్ కాఫీ పండిస్తున్న రైతుల వద్ద కాఫీ నిల్వలను గుర్తించి,సేకరించాలన్నారు. కాఫీ,జీసీసీ, ఉద్యానవనశాఖ సిబ్బంది సంయుక్తంగా పనిచేసి గిరిజన రైతులు పండిస్తున్న పసుపు,మిరియాలను గిట్టుబాటు ధరలతో కొనుగోలు చేయాలని ఆదేశించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసి,ఆ సంఘాల వద్ద నుంచి జీసీసీ,మాక్స్ సంస్థలు వాటిని కొనుగోలు చేయాలన్నారు. ఈఏడాది నిర్దేశించిన కాఫీ సేకరణ సక్రమంగా జరగలేదని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.రానున్న ఐదేళ్లలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా మరో లక్ష ఎకరాల్లో కాఫీతోటలు విస్తరణ,75వేల ఎకరాల్లో పాతతోటలు పునరుద్ధరణకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జేసీ, ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో డాక్టర్ ఎం.జె.అభిషేక్‌గౌడ,ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు,జిల్లా హార్టికల్చర్ అధికారి రమేష్‌కుమార్‌రావు, కాఫీబోర్డు ఎస్ఎల్‌వో రమేష్,ఇన్‌చార్జి కాఫీ ఏడీ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రతి చిన్నారికి డీవార్మింగ్ మాత్రలు

కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలో డీవార్మింగ్‌మాత్రల పంపిణీ పకడ్బందీగా జరగాలని, ప్రతి చిన్నారికి మాత్రలు వేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వైద్యులు,ఎంపీడీవోలు,ఐసీడీఎస్ అధికారులు, ఎంఈవోలు,గిరిజన సంక్షేమశాఖ విద్యా విభాగం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో నిర్వహించే డీవార్మింగ్‌పై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 3.35 లక్షల మందికి మాత్రలు వేయాలన్నది లక్ష్యమని,ఈమేరకు 3.68లక్షల మాత్రలను అన్ని విద్యాసంస్థలకు పంపిణీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. 19ఏళ్ల లోపు వయసున్న పిల్లలందరితో ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలన్నారు.అన్ని అంగన్‌వాడీ ,ప్రభుత్వ,ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. 10వ తేదీన అందుబాటులో లేని పిల్లలు, విద్యార్థులకు17వతేదీన ఈ మాత్రలను పంపిణీ చేయాలన్నారు.అన్ని మండలాల ఎంపీడీవోలు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు.అనంతరం డీవార్మింగ్‌కు సంబంధించిన ప్రచార పోస్టర్లను కలెక్టర్ దినేష్‌కుమార్‌తో పాటు అధికారులు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ, రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం,డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా,జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు,జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ విశ్వమిత్ర,డీసీహెచ్ఎస్ డాక్టర్ కృష్ణారావు,ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం మేనేజర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ పరిధిలోని పదో తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పీవో కట్టా సింహాచలం తెలిపారు.

ఇందుకోసం సబ్జెక్టు టీచర్లకు రెండు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు.

ఐటీడీఏ కార్యాలయ సమావేశం హాల్‌లో బుధవారం డీడీ విజయశాంతి, ఏటీడబ్ల్యూవో, ఎంఈవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నూరుశాతం ఫలితాలు సాధించేందుకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. 6,7 తేదీల్లో సబ్జెక్టు టీచర్లకు రెండు రోజుల ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు తీసుకోవాలన్నారు. గిరిజన విద్యార్థులకు మెను ప్రకారం భోజనం అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, ఏటీడబ్ల్యూవోలు రామతులసి, కృష్ణ మోహన్, కె.సుజాత, ఎంఈవోలు వి.ముత్యాలరావు, రామకృష్ణ, బాపిరాజు, వై.వెంకన్న, పి.శ్రీనివాసరావు, సూరారెడ్డి, తాతబ్బాయి, బి.ఎస్.కుమార్ పాల్గొన్నారు.


సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న పీవో సింహాచలం

మరో విద్యార్థి మృతదేహం లభ్యం

ముంచంగిపుట్టు: ఆంధ్ర,ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో గల జోలాపుట్టు జలాశయంలో మరో విద్యార్థి మృతదేహం లభ్యమైంది. జోలాపుట్టు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు నాటు పడవపై రీల్స్ చేస్తూ గల్లంతైన విషయం తెలిసిందే.ఒడిశా రాష్ట్రం కొరాపుట్టు జిల్లా కేంద్రానికి చెందిన ఓడీఆర్ఏఎఫ్ బృందాలు గాలిస్తుండగా మంగళవారం అమిత్ హంతాల(15) మృతదేహం లభించిన విషయం తెలిసిందే. బుధవారం ఉదయం 7గంటల సమయంలో ఓడీఆర్ఏఎఫ్ బృందాలు గాలింపు చేసేందుకు సిద్ధమవుతుండగా జలాశయంలో శివ హంతాల(15) మృతదేహం తేలుతూ కనిపించింది.దీంతో మృతదేహాన్ని బయటకు తీశారు.కొడుకు మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు పార్వతి,సురేంద్ర కన్నీరుమున్నీరుగా విలపించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు శివ కుటుంబానికి ఒడిశాకు చెందిన రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా రూ.20వేలను సంస్థ ప్రతినిధులు,రెవెన్యూ అధికారులు అందించారు.


జోలాపుట్టు జలాశయం నుంచి శివ మృతదేహాన్ని బయటకు తీస్తున్న ఓడీఆర్ఏఎఫ్ బృందాలు

‘ఏకలవ్య’ భూ దాతలకు అండగా ఎస్టీ కమిషన్

చైర్మన్ శంకరరావు

దుంబ్రిగుడ: మండలంలోని ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయ నిర్మాణానికి భూములు ఇచ్చిన దాతలకు ఉపాధి కల్పించేంత వరకూ ఎస్టీ కమిషన్ అండగా ఉంటుందని ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు స్పష్టం చేశారు. బాధిత గిరిజనుల దీక్ష శిబిరాన్ని ఆయన బుధవారం సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు ఆయనకు వినతి పత్రం అందజేశారు. అనంతరం శంకరరావు మాట్లాడుతూ సాగు భూములు ఇచ్చి ఏడేళ్లు గడుస్తున్నా ఉపాధి కల్పించకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. బాధితులకు ఉపాధి కల్పించే విధంగా కలెక్టర్, ఎస్టీ కమిషనర్‌కు సూచిస్తామన్నారు. ఆయన వెంట కమిషన్ సభ్యురాలు రామలక్ష్మి ఉన్నారు. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతకుమారి బాధితులతో జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. బాధితులకు సంఘీభావంగా సీపీఎం మండల కార్యదర్శి పోతురాజు పాల్గొన్నారు.

కొత్తపల్లి జలపాతం సందర్శన

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతాన్ని బుధవారం సాయంత్రం ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకరరావు సందర్శించారు. జలపాతం వద్ద పర్యాటకులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో సమస్యలు ఆయన అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, మెడికల్ కౌన్సిల్ సభ్యుడు తమర్బ నర్సింగరావు, ఎస్టీ కమిషన్ సభ్యులు లిల్లీ, శంకర్‌నాయక్ ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర,వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ డాక్టర్ తెడబారికి సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మను దర్శించుకున్న ఎస్టీ కమిషన్ చైర్మన్

పాడేరు : రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డి.వి.జి.శంకర్‌రావు, బృందం సభ్యులు జంపరంగి లిల్లీ, కొర్రా రామలక్ష్మి, వడిత్య శంకర్‌నాయక్‌లు బుధవారం పాడేరు సందర్శనకు వచ్చారు. ఇందులో భాగంగా మోదకొండమ్మ తల్లి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్టీ కమిషన్ బృందానికి పాడేరు ఎమ్మెల్యే, ఆలయ కమిటీ చైర్మన్ మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఘన స్వాగతం పలికారు. ఆలయ అర్చకుడు సుబ్రమణ్యస్వామి పూర్ణకుంభంతో ఆహ్వానించారు. వారు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్‌రావుతో పాటు సభ్యులను పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు శాలువలు కప్పి ఘనంగా సన్మానించి, అమ్మవారి చిత్రపటాలను అందజేశారు. పాడేరు జిల్లా ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ తమర్బ నర్సింగరావు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ సంయుక్త కార్యదర్శి కూడా సురేష్‌కుమార్, ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు శరభ సూర్యనారాయణ, నాయకులు తెడబారికి సురేష్‌కుమార్, సుబ్రహ్మణ్యం, న్యాయవాది తమర్బ ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: తన భూమి తనకు అందజేయాలని న్యాయ కొసం పోరాడుతూ దీక్ష చేస్తున్న మహిళ గంపరాయి బాలప్రభను రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డి.వి.జి.శంకర్‌రావు బుధవారం కలిశారు. ఈ నేపథ్యంలో ఆమెకు జరిగిన అన్యాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంపై ఉన్నత అధికారులతో మాట్లాడి ఆమెకు న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయనను స్థానిక గిరిజన సంఘం నాయకులు కలిసి మండల కేంద్రంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై శంకర్‌రావు మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎస్టీ కమిషన్ సభ్యురాలు జంపరంగి లిల్లిసురేష్, గిరిజన సంఘం నాయకుడు కృష్ణారావు తదితరులున్నారు.


కొత్తపల్లి జలపాతాన్ని సందర్శించిన ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు, సభ్యులు


ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్‌రావుకు అమ్మవారి చిత్రపటాన్ని ఇస్తున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, ఆలయ కమిటీ ప్రతినిధి నాయుడు

కూటమి పార్టీలకు ఎన్నికల కోడ్ వర్తించదా?

- తొలగించని ఫ్లెక్సీలు, జెండాలు
- అధికారుల నిర్లక్ష్యం


నక్కలపుట్టులో టీడీపీ నేత ఇంటిపై తొలగించని పార్టీ జెండా

పాడేరు రూరల్: కూటమి జెండాలు, ఫ్లెక్సీలకు, ఎన్నికల కోడ్ వర్తించదా అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాడేరుకు సమీపంలో నక్కలపుట్టు, సేరుబయలు, ప్రాంతాలతో పాటు ఎస్పీ కార్యాలయం సమీపంలో ఉన్న జనసేన పార్టీ కార్యాలయం , నక్కలపుట్టులో టీడీపీ నేత ఇంటివద్ద పార్టీ ఫ్లెక్సీలు, జెండాలు దర్శనం ఇస్తున్నాయి. ఇటీవల ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ మేరకు రాజకీయ పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు, తొలగించాల్సి ఉండగా ఇక్కడి మండల స్థాయి అధికారులు మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. వివిధ పార్టీల ఫ్లెక్సీలు, పోస్టర్లు, బ్యానర్లు తొలగించి, అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వ జెండాలు, ఫ్లెక్సీలు మాత్రం తొలగించకుండా వదిలేశారని పలువురు చెబుతున్నారు. దీంతో అధికారుల తీరుపై పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు సర్వత్రా విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పార్టీల జెండాలు, ఫ్లెక్సీలను తొలగించాలని కోరుతున్నారు.


సేరుబయలులో జనసేన పార్టీ కార్యాలయంలో తొలగించని జెండాలు, ఫ్లెక్సీలు


పాడేరు–విశాఖ ప్రధాన రహదారిలో దర్శనమిస్తున్న టీడీపీ ఫ్లెక్సీలు

అందుబాటులో అంబులెన్స్ సేవలు

- సోనూసూద్ ఫౌండేషన్ ద్వారా రెండు వాహనాల వితరణ
- కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రారంభం


జెండా ఊపి అంబులెన్స్‌లను ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: సినీ నటుడు సోనూసూద్‌కు చెందిన సోనూసూద్ ఫౌండేషన్ అల్లూరి జిల్లాకు రెండు కొత్త అంబులెన్స్‌లను వితరణ చేసింది.ఈ కొత్త అంబులెన్స్‌లను కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ బుధవారం కలెక్టరేట్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ సోనూసూద్ ఫౌండేషన్ తరపున రూ.26లక్షల విలువైన రెండు అంబులెన్స్‌లను జిల్లాకు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. పాడేరు డివిజన్ పరిధిలోని రూడకోట, ఆర్.జె.పాలెం ప్రాథమిక కేంద్రాలలో ఈ రెండు కొత్త అంబులెన్స్‌లను వినియోగించాలని అధికారులను ఆదేశించారు. నిరంతరం అంబులెన్స్‌లు అందుబాటులో ఉండాలని, అత్యవసర సమయంలో రోగులకు వైద్య సేవలకు వినియోగించాలని సూచించారు. డీఆర్వో పద్మలత, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ విశ్వమిత్ర, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా: వ్యాపారులకు గాయాలు


ప్రమాదంలో గాయపడ్డ త్రినాథ్


బోల్తాపడిన ఆటో

దుంబ్రిగుడ: మండలంలోని కించుమండల పంచాయతీ కేంద్రం జాతీయ రహదారిలో ఆటోను ఢీకొన్న ప్రమాదంలో ఆవు మృతి చెందగా పలువురు వ్యాపారులకు గాయాలయ్యాయి. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పోతంగి పంచాయతీ పనసపుట్టు గ్రామానికి చెందిన వ్యాపారులు సంతలో వ్యాపారం పూర్తి చేసుకొని తిరుగుప్రయాణంలో స్వగ్రామానికి ఆటోలో బయలుదేరారు. కించుమండ సమీపంలో ఒక్కసారిగా ఆవు అడ్డంగా రావడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న పలువురు వ్యాపారులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన వారికి సపర్యలు చేసి 108కు సమాచారం అందించారు. అయితే అంబులెన్స్ అందుబాటులో లేక రాకపోవడంతో బాధిత కుటుంబీకులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఆటో ప్రమాదంలో గొల్లోరి త్రినాథ్‌కు కుడి కాళ్లు విరిగిపోయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలంలో చేరుకుని జరిగిన ప్రమాదంపై ఆరా తీస్తున్నారు.

ఎలుగు దాడి బాధితులకు ఆర్థిక సాయం


బాధితులకు చెక్కులను అందజేస్తున్న డీఎఫ్‌వో వెంకట సందీప్‌రెడ్డి

సాక్షి,పాడేరు: దుంబ్రిగుడ మండలం పిట్టగూడ అటవీ ప్రాంతంలో గతేడాది అక్టోబర్ 17న ఎలుగుబంటి దాడి ఘటనలో గాయపడిన బాధిత గిరిజనులకు అటవీశాఖ ఆర్థిక సాయం మంజూరు చేసింది. ఇందులో భాగంగా బాధితులు కిల్లో లక్ష్మికి రూ.2లక్షలు, కిల్లో కేశవరావుకు రూ.2లక్షలు, వలజంగి సీతకు రూ.2వేలు చొప్పున చెక్కులను డీఎఫ్‌వో పి.వెంకట సందీప్‌రెడ్డి బుధవారం తన కార్యాలయంలో అందజేశారు. కార్యాలయం పర్యవేక్షకుడు విజయ్‌కుమార్, ఏవో అప్పన్న, ఫారెస్ట్ సెక్షన్ అధికారి జి.సీమ తదితరులున్నారు.

టీడీపీ జెండా తొలగింపు

- లక్ష్మీపేటలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై స్పందించిన కలెక్టర్ దినేష్‌కుమార్
- కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీకి డీపీవోకు ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..

పెదబయలు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున పెదబయలు మండలం లక్ష్మీపేట పంచాయతీ కూడలిలో టీడీపీకి చెందిన జెండాను ఎంపీడీవో కార్యాలయ సిబ్బందితో తొలగించినట్టు కలెక్టర్ దినేష్‌కుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ‘అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం’... లక్ష్మీపేటలో అమలుకాని ఎన్నికల కోడ్ శీర్షికతో ఈనెల 5న ‘సాక్షి’లో ప్రచురితమైన వార్తకు కలెక్టర్ దినేష్‌కుమార్ తక్షణమే స్పందించారు. ఈ సందర్భంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై లక్ష్మీపేట పంచాయతీ కార్యదర్శి తులసీకి షోకాజ్ నోటీసు జారీ చేయాలని , వెంటనే జెండాను తొలగించాలని నోడల్ అధికారి డీపీవో లవరాజు ఆదేశించినట్టు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశానుసారం ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది జెండాను తొలగించారు.


లక్ష్మీపేట కూడలిలో దర్శనమిస్తున్న టీడీపీ జెండా (నాడు)


టీడీపీ జెండా తొలగించిన అధికారులు (నేడు)